నేడు రక్తదాన శిబిరం

చింతల్: ఉషారాణి మెమోరియల్ ట్రస్ట్, ఉషారాణి నేచురోపతి క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఉషారాణి నేచురోపతి క్లినిక్ ఆక్యుపంచరిస్ట్ డాక్టర్ రాధిక లేళ్ల ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రక్తదాన శిబిరం ఏపీహెచ్‌బీ కాలనీలోని బాలాజీ రెసిడెన్సీలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఫోన్: 93928 37198.

కష్టపడితే మరిన్ని మెడల్స్



డీసీపీ కోటిరెడ్డితో భూమ్స్ అకాడమీ విద్యార్థులు, మాస్టర్ కృష్ణ

కుత్బుల్లాపూర్: బెంగళూరులో జరిగిన పోటీలో విజయం సాధించిన విద్యార్థులను మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అభినందించారు. శనివారం తన కార్యాలయంలో భూమ్స్ అకాడమీ నిర్వాహకుడు కృష్ణ ఆధ్వర్యంలో సుమారు 14 మంది విద్యార్థులు తాము సాధించిన మెడల్స్, షీల్డ్‌లను డీసీపీకి చూపించి ఏ అంశాల్లో పతకాలు సాధించామన్న విషయంపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్ద లక్ష్యాలను సాధించేందుకు ఇప్పటి నుంచే కష్టపడాలని, భవిష్యత్‌లో మరిన్ని మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు.

ఘనంగా విజయదశమి ఉత్సవాలు

నిజాంపేట్: ప్రగతినగర్ బస్తీలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఘనంగా విజయదశమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నరెడ్ల గోపాల్‌రెడ్డి, తాడేపల్లి నాగేంద్ర కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డా.కేశవరావ్ బలిరామ్ హెడ్గేవార్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘాన్ని 1925లో విజయదశమి పర్వదినాన స్థాపించారని తెలిపారు. ఈ విజయదశమికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న శుభతరుణంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని, కుటుంబ సమేతంగా పాల్గొనాల్సిందిగా వారు ఆహ్వానించారు. ప్రగతినగర్‌లోని శ్రీపట్టాభి రామాంజనేయ స్వామి దేవస్థానంలో ఉదయం 8 గంటలకు లలితా సహస్రనామ పారాయణం అనంతరం ఉదయం 9 గంటలకు వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈఎన్‌టీ సర్జన్ డా.మేజర్ నిఖిలేశ్, సామాజిక సమరసత అఖిల భారత కళా విభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ పాల్గొననున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దుండిగల్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ ఓఆర్ఆర్ ఎగ్జిట్–5కు వెళ్లే దారిలో నర్సాపూర్ రాష్ట్ర రహదారిపై ఓ వ్యక్తి మృతదేహం పడి ఉందని శనివారం పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అతడి వివరాలు తెలియలేదని, వయసు 45 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాలా కల్వర్ట్ రిటైనింగ్ వాల్‌పై మెట్లు



గిరినగర్ నాలా కల్వర్ట్ రిటైనింగ్ వాల్‌పై ఏర్పాటు చేసిన ఇనుప మెట్లు

రంగారెడ్డినగర్: అక్రమ నిర్మాణదారులు ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గిరినగర్ నాలా సమీపంలో ఇటీవల పైఅంతస్తులో షటర్లు నిర్మించాడు. అయితే పైకి మెట్లను ఏర్పాటు చేసేందుకు స్థలం లేకపోవడంతో సమీపంలో ఉన్న నాలా కల్వర్ట్ రిటైనింగ్ వాల్‌పై ఇనుప మెట్లను అమర్చాడు. రూ.50 లక్షల నిధులు వెచ్చించి చేపట్టిన నాలా కల్వర్ట్ విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసిన రిటైనింగ్ వాల్ దెబ్బతినే అవకాశం ఉంది. ఇప్పటికైనా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి నాలా కల్వర్ట్ రిటైనింగ్ వాల్‌పై ఏర్పాటు చేసిన ఇనుప మెట్లను తొలగించి, సదరు నిర్మాణదారుడిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గూడు చెదిరె.. గుండె పగిలె!

సొంతింట్లో ఉన్నామనే భ్రమతో.. ఇంటి శిథిలాల వద్ద బరువెక్కిన గుండెతో.. పుట్టెడు దుఃఖాన్ని ఆపుకొని.. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని గంపెడు ఆశతో ఎదురుచూస్తున్న గాజులరామారంలోని హైడ్రా చేతిలో ఇళ్లు కోల్పోయిన బాధితుల బాధలు వర్ణనాతీతం. చీకటి నింపిన మా బతుకుల్లో వెలుగులు హైడ్రా అధికారులు వెలుగులు నింపాలని బాలయ్యనగర్‌లో ఇళ్లు కోల్పోయిన బాధితులు రోజుకో విధంగా నిరసన వ్యక్తం చేస్తూ తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – సుభాష్‌నగర్



బాలయ్యనగర్‌లో రోడ్డుపై బట్టలు ఉతుకుతున్న బాధితులు

- నిరాశ్రయులుగా నిరుపేదలు
- ఇళ్లను కూల్చివేసిన హైడ్రా అధికారులు
- వారం రోజులుగా శిథిలాల వద్దే..
- రోజుకో రూపంలో నిరసన
- 6న మరిన్ని కూల్చివేస్తామన్న అధికారులు

గాజులరామారంలోని సర్వే నంబర్ 307 బాలయ్యనగర్, గాలి పోచమ్మబస్తీ ఇతర ప్రాంతాలలో ఈ నెల 21న హైడ్రా పోలీసు భద్రత మధ్య పెద్ద ఎత్తున కూల్చివేతలు చేపట్టింది. వందల సంఖ్యలో ఇళ్లు కోల్పోయిన వారు రాత్రనక, పగలనక వర్షంలోనే కూలిన శిథిలాల వద్ద అన్నమో రామచంద్ర అంటూ బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఆ బస్తీల వైపు ఏవైనా వాహనాలు వస్తే.. ఏదో సహాయం చేస్తారని గంపెడు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఎవరైనా అధికారులు వచ్చి తమ ఇళ్లను కూల్చివేస్తారేమోనని మిగతా నివాసం ఉంటున్న వారు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. పైసా పైసా కూడబెట్టి కట్టుకున్న ఇళ్లు కూల్చివేయగా, ఇక మమ్మల్ని ఎవరు ఆదుకుంటారు? ఎక్కడికి వెళ్లాలి? అంటూ ప్రశ్నిస్తున్నారు.



ఇల్లు కూల్చేయడంతో సామాను తరలిస్తూ..

అంధకారంలో..

కూల్చివేతల సమయంలో ముందస్తుగా విద్యుత్ తీగలను కట్ చేసి, స్తంభాలను ధ్వంసం చేయడంతో బస్తీలో అంధకారం నెలకొంది. కొన్ని సంవత్సరాలుగా ఉంటున్న బస్తీవాసులు వారం రోజుల నుంచి చీకట్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. కనీసం ఫోన్ చార్జింగ్ పెట్టుకునే పరిస్థితి లేదు. దీంతో అధికారులు, ప్రభుత్వంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రాత్రి వేళలో కూలిన శిథిలాల వద్ద బిక్కుబిక్కుమంటూ పిల్లాపాపలతో కాలం వెళ్లదీస్తున్నారు. వంట సామాగ్రి శిథిలాల కింద ఉండిపోవడంతో కనీసం వంట చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమ్మో ఆరవ తేదీ..

అధికారులు అక్టోబర్ 6న మరోసారి కూల్చివేతలు చేపడతామని ప్రకటించడంతో మిగతా ఇళ్లలో నివాసం ఉంటున్నవారు ఏమి జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. పనికి వెళ్లకుండా నిత్యం ఇంటి వద్దనే గడుపుతున్నారు. ప్రగతినగర్, మిథిలానగర్‌లలో ఎకరాల కొద్ది స్థలాన్ని బడాబాబులు కబ్జా చేసి బహుళ అంతస్తులు నిర్మించారని, వాటి జోలికి అధికారులు ఎందుకు వెళ్లడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. పేదలకో న్యాయం, పెద్దలకో న్యాయమా? అని ప్రశ్నిస్తున్నారు.



బాలయ్యనగర్ గాలిపోచమ్మ బస్తీలో కూల్చివేసిన ఇళ్లు



శిథిలాల వద్ద ఆడుకుంటున్న చిన్నారులు

వరద బాధితులను ఆదుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ శ్రేణులు

నిజాంపేట్: వర్షానికి నీట మునిగిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా ఒకే ప్రాంతంలో నివాసముంటున్న పేద ప్రజలను ఒక పక్క నుంచి ఇంకో పక్కకు తరలిస్తూ చెరువులో మునిగిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. వేరే ప్రాంతాల వాళ్లకి బాచుపల్లి మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు అయ్యాయని, ఇదే బాచుపల్లిలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బాధిత గిరిజన కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణ సహాయం కింద రూ.50వేలు ఇవ్వడంతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నారాయణమూర్తి, గజ్జెల్లి సంతోష్, కాసాని సంతోష్, అశోక్ నాయక్, ప్రహ్లాద్, విజ్ఞాన్‌రెడ్డి, భార్గవిరెడ్డి, లోకేష్, వినీత్‌రెడ్డి, సాయిరామ్‌రెడ్డి, కార్తిక్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేయొద్దన్నందుకు కార్మికులపై దాడి



బహదూర్‌పల్లి రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

- రహదారిపై బైఠాయించిన కార్మికులు
- టీస్టాల్ నిర్వాహకులపై కేసు నమోదు

సుభాష్‌నగర్: రోడ్డుపై ఎందుకు చెత్త వేస్తున్నారని ప్రశ్నించినందుకు సూపర్‌వైజర్, ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులపై దాడి చేసిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ బహదూర్‌పల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శనివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో బహదూర్‌పల్లి -కొంపల్లి ప్రధాన రహదారి ఆయుష్ వనం వద్ద ఓ టీస్టాల్ యజమాని రోడ్డుపై చెత్త వేస్తుండగా పారిశుద్ధ్య కార్మికులు బాలమణి, వెంకటమ్మ ప్రశ్నించారు. దీంతో టీస్టాల్ యజమాని, అతడి కుటుంబ సభ్యులను పిలిపించి కార్మికులపై దాడి చేశారు. అడ్డుకునేందుకు వెళ్లిన సూపర్‌వైజర్ దుడ్డు సూరిపై దాడి చేశారు. దీంతో విషయం తెలుసుకున్న తోటి కార్మికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రోడ్డుపై బైఠాయించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు అక్కడకు చేరుకొని వారితో మాట్లాడారు. దుండిగల్ పోలీసులు అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. కార్మికులు అంతటితో ఆగకుండా నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఆనుకొని ఉన్న టీస్టాల్‌ను తొలగించారు. దాడికి పాల్పడిన టీస్టాల్ యజమాని శ్యామ్, అతడి తండ్రి శ్రీనివాస్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శానిటరీ సూపర్‌వైజర్ శ్యామ్

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



జగద్గిరిగుట్టలో కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకల్లో కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ



కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ తొలి, మలి ఉద్యమాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటం యావత్ తెలంగాణ సమాజానికి స్ఫూర్తిదాయకమని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. లక్ష్మణ్‌బాపూజీ జయంతిని పురస్కరించుకుని కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి శనివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఈఎం తిరుపతి, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు. జగద్గిరిగుట్టలో కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ నివాళులర్పించారు.

హౌసింగ్ బోర్డు స్థలాల వేలంపాట

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని తెలంగాణ హౌసింగ్ బోర్డు ప్లాట్లకు వచ్చేనెల 6వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు హౌసింగ్ బోర్డు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 22 ప్లాట్లకు నిర్వహించే ఈ వేలం పాటలో పాల్గొనే ఔత్సాహికులు ముందుగా డీడీ తీయాల్సి ఉంటుంది. వివరాలకు ఫోన్: 93810 62746.

మద్యం బ్లాక్ అడ్డాపై పోలీసుల దాడి

7 లీటర్ల మద్యం సీజ్

కుత్బుల్లాపూర్: బ్లాక్‌లో మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డ బజరంగ్‌హిల్స్‌లో బండి వెంకటేష్‌గౌడ్(50) నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేపడుతున్నాడు. సమాచారం అందుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు శనివారం అడ్డాపై దాడులు నిర్వహించి 7 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వెంకటేష్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాచుపల్లి ఫ్లైఓవర్ పనుల జాప్యంపై నిరసన



నిరసనలో పాల్గొన్న స్థానికులు, బీజేపీ నాయకులు

నిజాంపేట్: బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో జాప్యం, నిర్లక్ష్యం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మీ సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం హరితవనం కాలనీ కమాన్ వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. వర్షంలోనూ నిరసన కొనసాగింది. ఫ్లైఓవర్ నిర్మాణంపై శ్వేతపత్రం విడుదల చేయాలని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన నిర్మాణాలకు ముందుగా ఇరుపక్కల సర్వీస్ రోడ్లను అత్యవసరంగా పూర్తి చేయాలని కోరారు. ప్రజల సౌలభ్యం కోసం యూటర్న్‌లను క్రాస్ రోడ్లకు దగ్గరగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, దాసి నాగరాజు, రచ్చ చక్రధర్, కొండమ నాయుడు, వివిధ కాలనీల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీలలితా త్రిపుర సుందరి, అన్నపూర్ణ దేవిగా అమ్మవార్లను శనివారం అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. – కుత్బుల్లాపూర్



గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో పూజల్లో మురళిగౌడ్, సుకన్య దంపతులు



రంగారెడ్డినగర్‌లో దుర్గామాత పూజల్లో కార్పొరేటర్ జగన్, జంట నగరాల వైఎస్‌సీపీ అధ్యక్షుడు దంపబోయిన శ్రీనివాస్



అన్నపూర్ణాదేవిగా పేట్‌బషీరాబాద్‌లోని శ్రీకట్టమైసమ్మ

రోడ్డు పక్కనే భవన నిర్మాణ వ్యర్థాలు



శ్రీరామ్‌నగర్ కాలనీలో మిలటరీ కాంపౌండ్ వాల్ వద్ద వ్యర్థాలు

రంగారెడ్డినగర్: ఇళ్ల నిర్మాణ వ్యర్థాలను రోడ్ల పక్కన డంప్ చేస్తూ భవన నిర్మాణదారులు చేతులు దులుపుకుంటున్నారు. కుత్బుల్లాపూర్ శ్రీరామ్‌నగర్ కాలనీలోని పలు ఇళ్ల నిర్మాణదారులు పాత ఇళ్లను కూల్చివేసి నూతన నిర్మాణాలు చేపట్టే క్రమంలో ఇళ్ల వ్యర్థాలను రోడ్లపైనే డంప్ చేస్తున్నారు. కాలనీకి ఆనుకుని ఉన్న మిలటరీ కాంపౌండ్ వాల్ వద్ద పారబోస్తున్నారు. దీంతో గ్రీనరీ దెబ్బతింటోందని, జీహెచ్‌ఎంసీ అధికారులు సదరు నిర్మాణదారులను గుర్తించి వ్యర్థాలు వేయకుండా కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రైవేట్ కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా సిబ్బంది శనివారం బతుకమ్మ ఆడారు. – రంగారెడ్డినగర్



చింతల్ రాయల్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు



దుండిగల్ ఎంఎల్ఆర్ఐటీఎం, ఫార్మసీ కళాశాలలో బతుకమ్మలతో మహిళా అధ్యాపకులు



చింతల్‌లోని శ్రీవిద్యా జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు



దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ తదితరులు



ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో కోశాధికారి మర్రి మమతరెడ్డి, డైరెక్టర్ శ్రేయారెడ్డి